సాక్షి
సిద్దిపేట
శనివారం । 14 । డిసెంబర్ । 2024



కల నెరవేరిన వేళ..

పోలీస్ కావాలని కలగన్నారు. కష్టపడి కొలువు సాధించారు. శిక్షణ పూర్తి చేసుకొని ప్రస్తుతం విధుల్లో చేరారు. వివరాలు 8లో ▸



గంజాయి పట్టివేత

800 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జహీరాబాద్‌లో చేసుకుంది. వివరాలు 8లో ▸



ప్రైవేట్‌కే మొగ్గు

జగదేవ్‌పూర్‌లోని వివిధ గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు ప్రైవేటు వ్యాపారులకే ధాన్యం విక్రయించారు. వివరాలు 9లో ▸

మల్లన్న హుండీ ఆదాయం రూ.81.68 లక్షలు





ఆలయంలో నగదు లెక్కింపును పరిశీలిస్తున్న అధికారులు, (ఇన్‌సెట్‌లో) భక్తులు సమర్పించిన కానుకలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న స్వామికి హుండీ ద్వారా రూ.81,68,044 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి బాలాజీ తెలిపారు. శుక్రవారం ఆలయ ముఖ మండపంలో హుండీలలో భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. వచ్చిన నగదులో విదేశీ కరెన్సీ నోట్లు 26, మిశ్రమ బంగారం 146 గ్రాములు, వెండి 5కిలోల 200 గ్రాములు, పసుపు బియ్యం 5.5క్వింటాళ్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణ అధికారి మాట్లాడుతూ 73రోజులలో హుండీల ద్వారా లభించిన నగదును స్థానిక బ్యాంక్‌లో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, ఆలయ ధర్మకర్తలు, శివరామకృష్ణ సేవ సమితిసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి తాళం.. చదువులకు మంగళం!





మిరుదొడ్డిలో మూతబడిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, (ఇన్‌సెట్‌లో) వేసిన తాళాలు..

మిరుదొడ్డి(దుబ్బాక): తమ డిమాండ్ల సాధనకు సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ప్రభావం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినుల బోధనపై పడుతోంది. మిరుదొడ్డిలోని కేజీబీవీలో విద్యాబోధన చేసే 20 మంది సర్వ శిక్షా ఉద్యోగులు సమ్మె బాట పట్టడంతో బోధించే వారు లేక కేజీబీవీకి తాళం వేశారు. మూడు రోజులుగా మూతబడి దర్శనమిస్తోంది. దీంతో ఇందులో చదువుతున్న 343 మంది విద్యార్థినులు కేవలం హాస్టల్‌కే పరిమితం అయ్యారు. ప్రభుత్వం తమ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించక పోతే విద్యార్థుల సంరక్షణ బాధ్యతల నుంచి సైతం పూర్తిగా విరమించుకుని సమ్మె బాట పడతామని టీచర్లు అల్టిమేట ఇస్తుండటంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

నేడు కవిసమ్మేళనం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం మధ్యాహ్నం 2గంటలకు కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు వెన్నెల సాహితీ సంగమం అధ్యక్షుడు వంగర నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్కపెల్లి యాదగిరిలు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెన్నెల సాహితీ పురస్కారం గ్రహీత డాక్టర్ ఉదారి నారాయణ రచించిన 'మళ్లీ మనిషిలోకి' పుస్తకం పరిచయం చేయనున్నట్లు తెలిపారు. కవులు, రచయితలు, సాహితీ అభిమానులు హాజరుకావాలని కోరారు.

సెన్సార్ బోర్డు మెంబర్‌గా ఉపేందర్‌గుప్తా



మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తాను సెన్సార్ బోర్డు సభ్యుడిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుసగా రెండో సారి తనను సెన్సార్ బోర్డు సభ్యుడిగా నియమించినందుకు ప్రధామమంత్రి మోదీ, కేంద్ర మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ప్రజ్ఞాపూర్ విద్యార్థి



సాయికిరణ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

గజ్వేల్: జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సాయికిరణ్ ఎంపికయ్యారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలో సాయికిరణ్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. ఈ క్రమంలోనే ఈనెల 25నుంచి 28వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో సాయికిరణ్ తెలంగాణ తరపున ఆడనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వై.కృష్ణ, పీడీ విజయరేఖలు విద్యార్థినిని అభినందించారు.

క్రీడల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేటజోన్: సీఎం కప్ క్రీడల నేపథ్యంలో ఈనెల 17నుంచి 19 వరకు జరగనున్న జిల్లా స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధించిన శాఖల అధికారులతో క్రీడల నిర్వహణ, ఏర్పాట్లపై ఆరా తీశారు. సీఎం కప్ క్రీడలను విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఒకరోజు ముందుగా క్రీడ ప్రాంగణం తయారీ, తాగునీరు,మరుగు దొడ్ల సౌకర్యాలు తదితర కనీస వసతులు ఉండేలా చూడాలని సూచించారు. పీఈటీలను, క్రీడా సామగ్రి సరిపడేలా సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట సిద్దిపేట ఆర్డీఓ సదానందం, జిల్లా క్రీడా శాఖ అధికారి జయదేవ్ ఆర్య, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ సలీమ్ ఉన్నారు.

కుటుంబాలు.. 3.48 లక్షలు

జిల్లాలో 3.48లక్షల కుటుంబాలు ఉన్నట్లు సమగ్ర కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేతో తేలింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ సర్వేను చేపట్టింది. సర్వేను గత నెల 9 నుంచి 24వ తేదీ వరకు ఎన్యుమరేటర్ల ద్వారా నిర్వహించి ఆయా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

- జిల్లాలో పూర్తయిన సమగ్ర సర్వే
- 2014లో జరిగిన సర్వేలో 3.11లక్షలు..
- ఆన్‌లైన్‌లో డెటా నమోదు



సిద్దిపేట పట్టణంలోని 34 వార్డులో సర్వే నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: జిల్లాలోని 26 మండలాల్లో 3,48,680 కుటుంబాల సర్వే నిర్వహించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. ఇంకా కొన్ని చోట్ల ఆన్‌లైన్‌లో నమోదు చేసే క్రమంలో తప్పులు దొర్లడంతో వాటిని కరెక్షన్ చేస్తున్నారు. ఇంక కొందరు సర్వేకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అత్యధికంగా కుటుంబాలు సిద్దిపేట అర్బన్ మండలంలో 42,881, అత్యల్పంగా దూల్మిట్ట మండలంలో 5,404 కుటుంబాలు ఉన్నాయి. తొలుత జిల్లా వ్యాప్తంగా 3,25,952 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు.

కలెక్టర్ ప్రత్యేక చొరవ..

ఈ సర్వే కోసం 2,538 మంది ఎన్యుమరేటర్లు, 252 మంది సూపర్‌వైజర్లను వినియోగించారు. సర్వే చేసిన దరఖాస్తులను ఆయా మండలాలు, మున్సిపాలిటీలలో ప్రత్యేకంగా కంప్యూటర్ అపరేటర్‌లను నియమించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలో సమగ్ర ఇంటింటి సర్వేను కలెక్టర్ మనుచౌదరి ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతంగా పూర్తి చేశారు. అలాగే అదనపు కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీఓలు పర్యవేక్షించారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 కుటుంబాల చొప్పున సర్వే చేశారు.

పెరిగిన 37వేల కుటుంబాలు

గత ప్రభుత్వం ఆగస్టు 19, 2014లో ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించింది. గత సర్వేలో 3,11,183 కుటుంబాలు ఉన్నట్లు తేలింది. జిల్లాలో పదేళ్లలో 37,497 కుటుంబాలు పెరిగాయి. ఇవిధంగా చూస్తే ఏడాదికి 3,700 కుటుంబాలు పెరిగాయని చెప్పవచ్చు.

1.18 కుటుంబాలకే పక్కా ఇళ్లు?

జిల్లాలో 3,48,680 కుటుంబాలుండగా అందులో 2,30,483 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేశారు. ఈ లెక్కన చూస్తే 1,18,197 మందికే పక్కా ఇళ్లు ఉన్నాయా సందేహం కలుగుతుంది. దీని ప్రకారం చూస్తే కొందరు పక్కా ఇళ్లు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేశారని సమాచారం.

> **ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి**
>
> జిల్లాలో సమగ్ర కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే పూర్తయింది. ఆన్‌లైన్‌లో కుటుంబాల వివరాలు నమోదు సైతం పూర్తి చేశాం. అందరి సహకారంతో విజయవంతంగా సర్వే నిర్వహించాం.
>
> – మనుచౌదరి, కలెక్టర్

గ్రూప్ 2 పరీక్షకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి పరీక్షలు
- 37 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 13,714 మంది అభ్యర్థులు
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



సిద్దిపేటరూరల్: టీజీపీఎస్సీ గ్రూప్ 2 పరీక్షల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి శుక్రవారం తెలిపారు. ఈనెల 15, 16 తేదీలలో పరీక్షలు జరుగుతాయన్నారు. మొత్తం 13,714 మంది అభ్యర్థులు పట్టణంలోని 37 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు 39 మంది విభాగాల అధికారులు, 37 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, నలుగురు రూట్ అధికారులు, 12 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 576 మంది ఇన్విజిలేటర్లు, 101 మంది బయో మెట్రిక్ ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. పేపర్ 1 పరీక్ష ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించన్నట్లు తెలిపారు. పేపర్ 2.. మధ్యాహ్నం 3 నుంచి 5:30 గంటల వరకు జరుగుతుందన్నారు. సోమవారం 3వ పేపర్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, 4వ పేపర్ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులను అరగంట ముందు వరకే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, ఆ తరువాత అనుమతించబోమన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: గ్రూప్ 2 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ అనురాధ తెలిపారు. బందోబస్తు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందితో సీపీ శుక్రవారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బయోమెట్రిక్ సిస్టంతో పూర్తి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సెంటర్ ఆవరణలో సీసీ కెమరాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. పరీక్షా సమయానికి 2గంటల ముందే కేంద్రానికి చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ప్రజ్ఞాపూర్, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎగ్జామ్ పోలీసు నోడల్ అధికారి ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు మధు, పురుషోత్తంరెడ్డి, సతీష్, ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై వివక్ష చూపితే చర్యలు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి



దివ్యాంగులతో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దివ్యాంగుల పట్ల వివక్ష చూపిన వారికి చట్టపరంగా శిక్షలుంటాయని, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అభయ జ్యోతి మానసిక దివ్యాంగుల పాఠశాలలో చట్టాలపై అవగాహన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్వాతిరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ద్వారా అందరికీ సమాజంలో జీవించే హక్కు ఉంటుందన్నారు. 14 ఏళ్ళలోపు ఉచిత విద్య, వైద్యం పొందే హక్కు దివ్యాంగులకు ఉంటుందన్నారు. మానసిక వికలాంగులకు ఉచిత చదువు, శిక్షణ, చికిత్స అందిస్తూ వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్న అభయ జ్యోతి మానసిక వికలాంగుల పాఠశాల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అథారిటీ అధికారులు, లయన్స్ క్లబ్ సభ్యులు, అభయ జ్యోతి మానసిక వికలాంగుల పాఠశాల నిర్వహకులు పాల్గొన్నారు.

చలి పంజా..



కొన్ని రోజులుగా చలితీవ్రత పెరుగుతోంది. చల్లని గాలులు వీస్తున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 19 నుంచి 20 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో సిద్దిపేట పట్టణంలోని ఎన్సాన్‌పల్లి రోడ్డులో ఓ కుటుంబం చలిమంటలు వేసుకున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

'ఆయిల్‌పామ్' లక్ష్యాన్ని అధిగమించాలి

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- కలెక్టరేట్‌లో సాగు పెంపుపై అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌పామ్‌కు సంబంధించి ఈ ఏడాది లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేసేలా కృషి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంపై ఆయిల్ ఫెడ్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 12,200 ఎకరాల్లో సాగవుతున్నదని, 2024–25కి మరో 4వేల ఎకరాల లక్ష్యం పెట్టుకోగా వాటిలో 1020 ఎకరాల్లో మొక్కలు పెట్టడం పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అయిల్‌పామ్ సాగులో జిల్లాకు ఇచ్చిన లక్షాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి రైతులకు లాభాలు తెలిపి చైతన్యపరచాలన్నారు. గ్రామాల్లో సాగుపై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. మండలాల వారీగా వెనుకబడిన క్లస్టర్ల ను రోజువారీగా పర్యవేక్షించాలని సూచించారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో వంద శాతం లక్ష్యాన్ని చేరేవిధంగా ముందుకు సాగాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, ఉద్యాన శాఖ అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- ధర్మారంలో 2కే రన్



2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత పాటు పడాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని ధర్మారంలో 2కే రన్‌ను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం తన వంతు కృషి చేస్తామంటూ యువకుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్ ఆర్గనైజర్ తోట కమలాకర్‌రెడ్డి, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధి నునిగాని రాజు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

వివాదాల వేదిక

సంగారెడ్డి జిల్లా జైలుపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

- రైతుకేమో బేడీలు.. ప్రముఖులైన వారికి సకల మర్యాదలు
- గతంలో ఓ ప్రముఖుడైన ఖైదీకి బిర్యానీలు సరఫరా..!
- వీడియోకాల్ కూడా చేయించినట్లు ఆరోపణలు
- అప్పట్లో ఉన్నతాధికారుల విచారణ



సంగారెడ్డి సెంట్రల్ జైలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జైలు వివాదాల వేదికవుతోంది. గుండెపోటుకు గురైన లగచర్ల రైతు హీర్యానాయక్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో బేడీలు వేసిన ఈ జైలు అధికారులు...గతంలో ఓ ప్రముఖుడైన ఖైదీకి సకల మర్యాదలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఓ పారిశ్రామికవేత్త హత్య కేసులో నిందితుడైన ఓ బడాబాబును ఈ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించగా.. ఆ ఖైదీకీ ఈ జైలు అధికారుల సకల మర్యాదలు చేశారని గతంలో ఆరోపణలు వచ్చాయి. అతను కోరినప్పుడల్లా బిర్యానీలు సరఫరా చేశారని, అతనికి వీడియోకాల్ చేసుకునే సదుపాయం కూడా కల్పించారనే ఫిర్యాదులు ఉన్నతాధికారులకు వెళ్లాయి. అలాగే కూకట్‌పల్లికి చెందిన ఓ రియల్టర్ రిమాండ్ నిమిత్తం ఈ జైలుకు రాగా ఆయనకు కూడా అన్ని మర్యాదలు చేశారనే విమర్శలు అప్పట్లో గుప్పుమన్నాయి. జైలులో పనిచేసిన ఇద్దరు అధికారుల మధ్య ముడుపుల వ్యవహారంలో తేడాలు రావడంతో ఈ బాగోతాలన్నీ బయటకు పొక్కాయనే విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారాలపై జైళ్ల శాఖ అప్పటి డీఐజీ మురళీబాబు అంతర్గత విచారణ కూడా చేపట్టారు. ఈ విచారణ నివేదిక ఉన్నతాధికారులకు అందజేశారు. ఇలా ప్రముఖులైన ఖైదీల సేవలో తరించే ఈ జైలు అధికారులు ఇప్పుడు గుండెపోటు వచ్చిన రైతును ఆసుపత్రికి తరలించే క్రమంలో బేడీలు వేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సంగారెడ్డి జిల్లా జైలును కొన్ని నెలల క్రితం సెంట్రల్ జైలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ జైలు అప్‌గ్రేడ్ అయ్యాక కూడా అదేస్థాయిలో వివాదాలు చోటు చేసుకోవడం గమనార్హం.

జైలు అధికారుల తప్పిదం..

హీర్యానాయక్‌కు బేడీలు వేసిన ఘటనలో ఆయన్ను ఆసుపత్రికి తరలించేందుకు జైలు అధికారులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులకు సమాచారం ఇవ్వాలి. కానీ బాలానగర్ కేసులో నిందితులని చెబుతూ సైబరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు గుర్తించామని ఐజీ సత్యనారాయణ గురువారం మీడియాతో పేర్కొన్నారు. ఈ తప్పిదాలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని ప్రకటించారు. ప్రాథమిక విచారణ జరిపిన వెంటనే ప్రభుత్వం జైలర్ సంజీవరెడ్డిపై సస్పెన్షన్ వేటు పడిన విషయం విదితమే. అయితే జైలు సూపరింటెండెంట్‌పై కూడా రానున్న రోజుల్లో చర్యలుండే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లగచర్ల కేసుకు సంబంధించి ఈ జైలులో ప్రస్తుతం మొత్తం 21 మంది రిమాండ్ ఖైదీలు ఉన్నట్లు తెలుస్తోంది. చర్లపల్లి జైలులో ఉన్న వీరిలో 16 మందిని సుమారు నెల రోజుల క్రితం సంగారెడ్డి జైలుకు తరలించిన విషయం తెలిసిందే.



ప్రాంతీయ పశువైద్యశాల గేటుకు తాళం

పశువైద్యం దైవాదీనం..

జిల్లాలో పశువైద్యంపై నిర్లక్ష్యం కొనసాగుతోంది. మూగజీవాలే కదా..! బతికినా.. చచ్చినా... ప్రశ్నించేవారెవరు అన్న తీరులో వైద్య సేవలు జరుగుతున్నాయి. మూగ రోదన ఎవరికీ పట్టడంలేదు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం ఈ ఘటనే.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తాము పెంచుకుంటున్న ఆవు అస్వస్థతకు గురికావడంతో వైద్య చికిత్స కోసం మధ్యాహ్నం గజ్వేల్ పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాలకు తీసుకువచ్చాడు. దీంతో పశు వైద్యశాల గేటుకు తాళం వేసి ఉండదంతో సదరు వైద్య సిబ్బందికి ఫోన్ చేశారు. శ్రీగిరిపల్లి ఆస్పత్రికి వెళ్లామని చెప్పడంతో వారు అక్కడికి వెళ్లారు. అక్కడా తాళం వేసి ఉండడంతో తిరిగి గజ్వేల్‌కు చేరుకొని వైద్య సిబ్బంది వచ్చిన తర్వాత ఆవుకు వైద్య చికిత్స చేయించుకొని వెళ్లారు. – గజ్వేల్‌రూరల్

క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఎస్టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం



మంత్రి పొన్నంకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఎస్టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపడుతున్న నిరవధిక సమ్మె విరమించేలా వారి సమస్యలు పరిష్కరించాలని మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరవధిక సమ్మె వల్ల విద్యా వ్యవస్థ కాంప్లెక్స్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పూర్తిగా కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మధుసూదన్ రావు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్, ఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి , రాష్ట్ర కోశాధికారి దుర్గం శ్రీనివాస్, రాష్ట్ర డీపీఓ వ్యవస్థాపక అధ్యక్షుడు ముగిలిపలం శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా టీఎస్ఎస్‌యూఎస్ అధ్యక్షుడు గుండా రాజీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రాలతో ధనసిరి విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: సీఎం కప్ జిల్లా స్థాయి ఆటల పోటీలకు మొగుడంపల్లి మండలంలోని ధనసరి విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం. రమేశ్ తెలిపారు. మండల కేంద్రమైన మొగుడంపల్లిలో మూడు రోజులపాటు నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. కబడ్డీ బాలికల విభాగంలో పాఠశాల విద్యార్థులు మొదటిస్థానంలో నిలిచారని పేర్కొన్నారు. వాలీబాల్ బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో వచ్చారన్నారు. శుక్రవారం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కొండ చిలువ కలకలం



అంకిరెడ్డిపల్లిలో కొండ చిలువ

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లిలోని వ్యవసాయ బావి వద్ద కొండ చిలువ కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన దండుగుల సంపత్ వ్యవసాయ బావి వద్ద పనులు చేసేందుకు వెళ్తుండగా పొలంలో కొండ చిలువ కనిపించడటంతో భయాందోళనకు గురై పరుగులు తీవాడు. ఈ విషయాన్ని చుట్టుపక్కల రైతులకు సమాచారం అందించాడు. కొండ చిలువ పారిపోతుండటంతో చంపేశాడు. రోజుకో గ్రామంలో కొండచిలువలు కనిపిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురతున్నారు. కొండపాక, మర్పడ్గ, దమ్మక్కపల్లి, గ్రామాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

కల నెరవేరిన వేళ..

కొలువుల్లోకి కొత్త కానిస్టేబుళ్లు, ఎస్ఐలు

- వారం రోజుల పాటు శిక్షణ
- కమిషనరేట్‌కు ఐదుగురు ఎస్ఐలు, 172 మంది కానిస్టేబుళ్లు
- 1,575కి చేరిన మొత్తం సిబ్బంది
- పోలీస్ సేవలు మరింత విస్తృతం
- శాంతి భద్రతల పరిరక్షణకు సేవలు వినియోగం



శిక్షణలో నూతన పోలీసు సిబ్బంది (ఫైల్)

సిద్దిపేటకమాన్: సమాజంలో ఎవరికి ఏ ఆపద, ప్రమాదం, గొడవ, ఇతర ఏ చిన్న సంఘటన జరిగిన మొదట గుర్తుకు వచ్చేది పోలీసు. అలాంటి పోలీసు ఉద్యోగం చేయడం నేటి యువత కల. పోలీసు ఉద్యోగం అంటేనే ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లు ఉండడమే కాకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. యూనిఫాం వేసుకుని విధులు నిర్వర్తించాలని ఎందరో కలలు కంటుంటారు. ఎంతో కష్టపడి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి ఉద్యోగాలకు ఎంపికై తొమ్మిది నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకుని 172 మంది నూతన పోలీసు కానిస్టేబుళ్లు, ఐదుగురు ఎస్ఐలు ఐదుగురు ఎస్ఐలు శాఖలో అడుగు పెట్టారు. కమిషనర్ కార్యాలయంలో నూతనంగా వచ్చిన సిబ్బందికి పోలీసు అధికారులు వారం రోజులపాటు వారి విధి నిర్వహణల గురించి శిక్షణ సైతం పూర్తి చేశారు. రైటర్, కోర్టు డ్యూటీ, భరోసా, సఖీ, షీటీమ్, రిసెప్షన్, సీసీటీఎన్ఎస్, బీట్ సిస్టం, వాహనాల తనిఖీ, కార్డన్ సెర్చ్, డయల్ 100 కాల్స్ అటెండ్, ఓట్ డోర్ ట్రైనింగ్, బందోబస్తు వంటి పలు అంశాల గురించి ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, పోలీసు అధికారులు శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం వీరిని పోలీసు విధులు, పిటిషన్ ఆన్‌లైన్, పార్ట్ వన్, టూ డైరీ వర్క్ వంటి పలు అంశాలను పరిశీలించి, తెలుసుకోవడానికి పలు పోలీసు స్టేషన్‌లకు పంపించారు. త్వరలోనే నూతన పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీ అనురాధ పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

పోలీసు కావాలనే కల నెరవేర్చుకున్నారు. పరీక్షలు, ఈవెంట్స్‌ను దాటి ఇష్టమైన కొలువులు సాధించారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అందుకున్నారు. కుటుంబ సభ్యులు సహకారం భర్తల ప్రోత్సాహం వెన్నుతట్టి విజయానికి బాటలు వేశాయని సగర్వంగా చెబుతున్నారు. చిన్నప్పటి నుంచి పోలీసు ఉద్యోగం సాధించాలనేది తన కల అని ఒకరు, ప్రజలకు ఏదైనా చేయాలనే లక్ష్యంతో ఇటు వైపునకు వచ్చానని మరొకరు. స్కూల్ లెవల్‌లోనే పోలీసు కావాలనే ధ్యేయానికి బీజం పాడిందని ఇంకొకరు. శాంతి భద్రతల పర్యవేక్షణలో తమ వంతు పాత్ర పోషించనున్నారు. కాగా, నూతనంగా పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐలుగా శిక్షణ తీసుకొని విధుల్లోకి చేరారు.

సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం 27 పోలీసు స్టేషన్‌లు ఉన్నాయి. సీపీ, ముగ్గురు అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు 07, సీఐలు 30 మంది, ఎస్ఐలు 55 మంది, ఏఎస్ఐలు 100 మంది, హెడ్ కానిస్టేబుళ్లు 223 మంది, కానిస్టేబుళ్లు 777 మంది, హోంగార్డులు 203 మంది ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు నూతనంగా వచ్చిన ఐదుగురు ఎస్ఐలు, 172 మంది కానిస్టేబుళ్లతో కలిపి మొత్తం పోలీసు అధికారులు, సిబ్బంది 1,575 మందికి చేరుకుంది. దీంతో శాంతి భద్రతల పరిరక్షణకు వీరి సేవలు ఉపయోగపడునున్నాయి. పోలీసు ఫోర్స్ పెరగడంతో సేవలు మరింత విస్తతం కానున్నాయి.



శిక్షణలో భాగంగా అడవుల్లో కానిస్టేబుళ్లు

పోలీసు జాబ్ అంటే ఇష్టం



చిన్నప్పటి నుంచి పోలీసు ఉద్యోగం సాధించాలనేది నా కల. మాది పుల్లూరు గ్రామం. నేను 2019లో డిగ్రీ పూర్తి చేసి మొదటి సారి పోలీసు ఉద్యోగం కోసం ప్రయత్నించినప్పుడు మెయిన్స్‌లో మిస్ అయింది. 2021లో వివాహం జరిగిన తర్వాత భర్త ప్రవీణ్, నాన్న ప్రోత్సాహంతో మళ్లీ ప్రయత్నించి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యా. ప్రస్తుతం క్విక్ రియాక్షన్ టీంలో పోస్టింగ్ ఇచ్చారు.

– సంకటి ప్రియాంక, కానిస్టేబుల్

ప్రజలకు ఏదైనా చేయాలనే..



దుబ్బాక మండలం ధర్మారానికి చెందిన నేను 2017లో బీటెక్ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. 2020లో బెటాలియన్ విభాగంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యా. ప్రజలకు ఏదైనా చేయాలనే లక్ష్యంతో తిరిగి మళ్లీ కష్టపడి చదివి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యా. ప్రస్తుతం భూంపల్లి పోలీసు స్టేషన్‌లో పోస్టింగ్ ఇచ్చారు.

– సుంకరి మనోజ్ కుమార్, సివిల్ కానిస్టేబుల్

తండ్రి, భర్త సహకారంతో..



మాది సిద్దిపేట.. 2021లో డిగ్రీ పూర్తి చేశా. ఇదే సంవత్సరం కోనాయపల్లి బాబుతో వివాహం జరిగింది. తండ్రి, భర్త సహకారంతో సన్నద్ధమై ఉద్యోగం సాధించాను. మొదటి ప్రయత్నంలో విఫలమైనా రెండో ప్రయత్నంలో సెలెక్ట్ అయ్యా. సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్‌కు పంపించారు. – గుమ్మడిదల కల్పన, సివిల్ కానిస్టేబుల్

స్నేహితుడి జన్మదిన వేడుకలకు వెళ్లొస్తుండగా..

- బైక్‌ను ఢీకొట్టిన బొలేరో వాహనం
- యువకుడు మృతి, మరో ఇద్దరికి గాయాలు



అరుణ్ (ఫైల్)

తూప్రాన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన పట్టణ కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. శివ్వంపేట మండల కేంద్రానికి చెందిన ఈసుగారి అరుణ్ (19), తన స్నేహితులైన మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేటకు చెందిన శ్రీనివాస్‌గౌడ్, పాలటకు చెందిన నీలం మహేందర్‌తో కలిసి తూప్రాన్‌లోని స్నేహితుడి జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. అనంతరం తిరిగి ఇంటికి బయలు దేరారు. తూప్రాన్‌లో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో బొలేరో వాహనం అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో ఇద్దరికి స్వల్పగాయాలు అయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గాయపడ్డ యువకుడు రాత్రంతా రోడ్డు పక్కనే..



శివ్వంపేట(నర్సాపూర్): ఘటనా స్థలంలో గాయాలతో రాజేందర్ రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు రాత్రంతా ఘటనా స్థలంలోనే ఉండిపోయిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధి చండీ గ్రామానికి చెందిన పుల్లగుర్ల రాజేందర్‌రెడ్డి గురువారం రాత్రి మనోహరాబాద్ మండలం జీడిపల్లి నుంచి బైక్ పై చండీకి వస్తున్నాడు. శివ్వంపేట మండల పరిధి సికింద్లాపూర్ గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన రాళ్లపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలతో స్పృహతప్పి పడిపోయాడు. చీకటిలో వాహనాదారులు గుర్తించకపోవడంతో రాత్రంతా అక్కడే పడి ఉన్నాడు. శుక్రవారం ఉదయం గుర్తించిన స్థానికులు ఆస్పత్రికి తరలించి కుటుంబీకుల సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



స్వామి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని చెప్యాల డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బెస్త గొల్ల స్వామి (31) కూలి పనులు చేసుకుంటూ భార్య విజయ, ఆరేళ్లలోపు కూతురిని పోషించుకుంటున్నాడు. కుటుంబ పోషణకు అందినకాడికి అప్పులు చేశాడు. అప్పుల వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో నిత్యం సతమతమయ్యేవాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో కూడా గొడవలు మొదలయ్యాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన స్వామి తాను నివాసం ఉంటున్న డబుల్ బెడ్ రూంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బోయిని పరుశరాములు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి..



నర్సింలు(ఫైల్)

తూప్రాన్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మల్కాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. గ్రామానికి చెందిన పల్లపు వడ్డే నర్సింలు(48) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నాడు. గురువారం ఇంటి నుంచి వెళ్లిన నర్సింలు తన సోదరుడికి ఫోన్ చేసి 'నా బిడ్డను జాగ్రత్తగా చూసుకోండి' అని చెప్పి స్విచ్ఛాఫ్ చేశాడు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మరోమారు వెతుకుతున్న క్రమంలో శుక్రవారం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గిరిజన మహిళ మృతి

ఇంట్లోని వంట పాత్రలను తీస్తుండగా ప్రమాదం



అనిత (ఫైల్)

నర్సాపూర్ రూరల్: విద్యుదాఘాతంతో గిరిజన మహిళ మృతి చెందిన ఘటన నర్సాపూర్ మండలం ఎర్రకుంట పంచాయతీ పరిధిలోని బాల్యా తండాలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. తండా గిరిజనులు, నర్సాపూర్ ఎస్సై లింగం కథనం మేరకు.. బాల్యా తండాకు చెందిన అలావత్ అనిత (27) ఇంట్లో వంట చేస్తున్న క్రమంలో స్టీల్ చిక్కులో ఉన్న పాత్రలను తీస్తుండగా కరెంటు షాక్‌కు గురై పడిపోయింది. భర్త శ్రీనివాస్ ఇంటి బయట ఉండగా భార్య అరుపులు విని ఇంట్లోకి వచ్చి చూసేసరికి మృతి చెందింది. విషయం తెలుసుకున్న తండా గిరిజనులు అనిత ఎలా చనిపోయిందని వంట ఇంట్లో పరిశీలించగా పాత్రలు ఉన్న స్టీల్ చిక్కుకు కరెంట్ సరఫరా అవుతున్నట్లు గుర్తించారు. అలాగే మిగితా ఇళ్లల్లో కూడా పరిశీలించగా అలాగే కరెంట్ వస్తుంది. దీంతో తండావాసులు రాత్రంతా భయం గుప్పెట్లో.. బిక్కుబిక్కుమంటూ ఉదయం వరకు జాగరణ చేశారు. ఈ విషయమై ట్రాన్స్ కో ఏఈ రామ్మూర్తిని వివరణ కోరగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. మృతురాలి భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.



తండాలోని ఓ ఇంట్లో తీగకు సరఫరా అవుతున్న కరెంట్

మాజీ సర్పంచ్‌ను చంపుతానని బెదిరింపు

కల్హేర్(నారాయణఖేడ్): మాజీ సర్పంచ్‌ను చంపుతానని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కల్హేర్ మండల కేంద్రానికి చెందిన శ్రీరం సంగయ్య గురువారం రాత్రి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ బుర్గుల పోచయ్య ఇంట్లో ప్రవేశించాడు. వచ్చే ఎన్నికల్లో సర్పంచ్ పదవి కోసం తనను ఎన్నుకోవాలని, లేదంటే చంపుతానని బెదిరించినట్లు తెలిపారు. ఇంట్లో ఉన్న అతడి భార్యతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు రింగ్‌రోడ్డు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు, ఎస్ఓటీ పోలీసులు సమ్మదగిన సమాచారం మేరకు కొల్లూర్ రింగ్‌రోడ్డుపై గురువారం డీసీఎంను పట్టుకున్నారు. అందులో తనిఖీ చేయగా 132 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉంది. డ్రైవర్ సయ్యద్ పాషాను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేయగా హైదరాబాద్ ప్రాంతంలోని పలు చోట్ల సేకరించి జహీరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిపాడు. డీసీఎంను సీజ్ చేసి బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అందజేసి, కేసు నమోదు చేశామన్నారు.

విధులకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



ఆసిఫ్ (ఫైల్)

చేగుంట (తూప్రాన్): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. చేగుంటకు చెందిన షేక్ ఆసిఫ్ సనత్ నగర్‌లో రైల్వే ఉద్యోగిగా పని చేస్తున్నాడు. 3న విధుల్లోకి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం ఇంటికి బస్సులో వస్తున్నానని ఫోన్ చేసి చెప్పాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకులు రైల్వే ఆఫీసుకు వెళ్లి విచారించగా ఆఫీసుకు జూన్ 29 వరకు వచ్చాడని అప్పటి నుంచి రావడం లేదని తెలిపారు. ఆసిఫ్ భార్య సిరీన్ చేగుంట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

రూ.96 వేలు రికవరీకి ఆదేశాలు

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు జరగడంతో డబ్బులు రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు అదనపు పీడీ బాలరాజ్ తెలిపారు. శుక్రవారం కల్హేర్‌లో జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదికలో అక్రమాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.96 వేలకు రికవరీ ఆదేశించామని, మరో రూ. 3 లక్షల డబ్బులకు సంబంధించి సరైన లెక్కలు లేకపోవడంతో సంబంధిత ఈజీఎస్ సిబ్బందికి షోకజ్ నోటీసులు ఇస్తామని అన్నారు. షోకాజ్ నోటీసులకు సరైన వివరణ ఇవ్వకుంటే తదుపరి చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం అమలులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూ వివాదంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

– ఇద్దరికి తీవ్ర గాయాలు

నర్సాపూర్ రూరల్: భూ వివాదంలో ఇరు వర్గాలకు మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం మేరకు.. కొత్తపేట తండాకు చెందిన భిక్షపతి నాయక్, పురుషోత్తం నాయక్ కుటుంబీకులకు, తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన పటేల్ లింగం, పటేల్ శ్రీనివాస్ కుటుంబీకులకు కొద్ది రోజులుగా తుజాల్‌పూర్ శివారులోని అసైన్డ్ భూమి కోసం వివాదం కొనసాగుతుంది. శుక్రవారం మరోసారి భూమి కోసం గొడవ జరుగగా భిక్షపతి నాయక్, పురుషోత్తం కుటుంబ సభ్యులు కలిసి కట్టెలు, కత్తులతో దాడి చేయగా పటేల్ లింగం, పటేల్ శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

800 కేజీల గంజాయి పట్టివేత

- సుమారు రూ.2 కోట్ల విలువ
- చిరాగ్‌పల్లి ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద లారీని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు



పోలీసులు పట్టుకున్న బస్తాల్లోని గంజాయి

జహీరాబాద్ టౌన్: సినీఫక్కీ తరహాలో లారీని వెంబడించి భారీ ఎత్తున గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన జహీరాబాద్ సమీపంలోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. డ్రగ్స్ తరలిస్తున్నారనే సమాచారంతో డీఆర్ఐ, నార్కోటిక్ డ్రగ్స్ కంట్రోల్, సెంట్రల్ విజిలెన్స్ మూడు బృందాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ పోర్టు నుంచి ముంబాయి వైపు వెళ్తున్న లారీని జిల్లా సరిహద్దులో గల చిరాగ్‌పల్లి అంతరాష్ట్ర ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద అడ్డుకున్నారు. ఏసీబీ అధికారులు చెక్‌పోస్టుపై దాడి చేస్తున్నారని భావించి చెక్ పోస్టులో పని చేస్తున్న సిబ్బంది అక్కడి నుంచి పారిపోయారు. వారితోపాటు లారీ డ్రైవర్, క్లీనర్‌లు పరారయ్యారు. అధికారులు లారీని స్వాధీనం చేసుకొని తనిఖీ చేయగా సిమెంట్ ఇటుకల మధ్య దాచిన 800 కేజీల గంజాయి లభ్యమైంది. వెంటనే లారీని చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీటి విలువ రూ.2 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

మాయ మాటలతో బురిడీ కొట్టించి..

వృద్ధురాలి మెడలోంచి పుస్తెల తాడు తస్కరణ



వివరాలు వెల్లడిస్తున్న వృద్ధురాలు లక్ష్మి

హుస్నాబాద్: మేము పోలీసులం, ఒంటి పై ఉన్న బంగారు అభరణాలు దొంగలిస్తున్నారని మాయ మాటలు చెప్పి ఓ వృద్ధురాలి మెడలో బంగారు పుస్తెలు తాడును తస్కరించిన ఘటన హుస్నాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హుస్నాబాద్ మండలంలోని పోతారం(ఎస్) గ్రామానికి చెందిన బొద్దుల లక్ష్మి శుక్రవారం ఆరోగ్య పరీక్షల కోసం హుస్నాబాద్‌కు వచ్చింది. పట్టణంలోని నాగారం రోడ్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకొని తిరిగి ఇంటి బాట పట్టింది. అంబేడ్కర్ చౌరస్తా వరకు వెళ్లిన ఆమెకు ఓ ముగ్గురు దుండగులు మాయమాటలు చెప్పి డాక్టర్ పిలుస్తున్నారని, రిపోర్ట్ కాపి ఇస్తాడని నమ్మబలికారు. నాకు రిపోర్ట్ కాపి ఇచ్చారని చెప్పినా మాటామాట కలుపుతూ నాగారం రోడ్డుకు తీసుకొచ్చారు. ఇక్కడ మరో వేషం వేస్తూ మేము పోలీస్‌లమని, రెండు రోజుల కిందట మహిళల మెడల నుంచి బంగారు అభరణాలు దొంగలించారని జాగ్రత్తగా ఉండాలని వృద్ధురాలిని నమ్మించారు. ఇంతలోనే ఆమె మెడలోని 2 తులాల బంగారు పుస్తెలు తాడును అపహరించారు. వృద్ధురాలు కేకలు వేయగా అప్పటికే దొంగలు పరారయ్యారు. వృద్ధురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

15 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

రామచంద్రాపురం(పటాన్ చెరు): చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. రామచంద్రాపురం సాయి నగర్ కాలనీలో 8న రామకృష్ణ నివాసంలో దొంగతనం జరిగిన సంగతి అందరికీ తెలిసిందే. నిందితుడు గురువారం రాత్రి పట్టణంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు మెహదీపట్నంకు చెందిన మహమ్మద్ హమీద్‌గా గుర్తించారు. అతడి వద్ద నుంచి 15 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని శుక్రవారం సాయంత్రం రిమాండ్ తరలించారు.

రోడ్డు భద్రతపై అవగాహన తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా నిర్వాహకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం, సహస్ర పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యువ రైడర్‌లలో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతా విద్యను సమగ్రంగా, ఆకర్షణీయంగా మార్చే లక్ష్యంతో విద్యార్థులకు వివరించారు. అలాగే సైద్ధాంతిక భద్రత రైడింగ్ పాఠాలు, ప్రమాద అంచనా శిక్షణ, రహదారి భద్రత క్విజ్‌లు, హెల్మెట్ అవగాహన సెషన్ నిర్వహించారు.